# పితృదేవోభవ



**వెంచాశా**

ఆదివారం—

పొద్దున ఎనిమిది గంటలకు బద్ధకంగా లేచాను. అన్ని రోజుల్లాంటిది కాదు కనక ఆదివారం ఇంకా కొంచెం సేపు పడుకోవాలనే ఉంటుంది. ఇంతసేపు పడుకోవడం లలితకు బొత్తిగా ఇష్టం ఉండదు. ఏడు గంట లయినప్పటినుండీ నా ప్రాణం తోడేస్తూనే ఉంటుంది. అలా ప్రాణం తోడుతూ ఉంటే బోలెడు హాయిగా ఉంటుంది. చిన్న పిల్లాడిలా మారాం చేయాలనిపిస్తుంది. ఇలాంటివన్నీ 'స్మాల్ ప్లెజర్స్ ఆఫ్ లైఫ్' అంటాను నేను. ఆ మాటకు లలిత నవ్వేస్తుంది.

కాఫీ సిప్ చేస్తుంటే నాకో ఐడియా వచ్చింది — ఈ వేళ ఎగ్స్ ఎందుకు తెప్పించకూడదూ అవి. నా కసలు అవి అలవాటు లేదు. ఒకసారి ఓ ఫ్రెండ్ ఇంటికి వెళ్లినప్పుడు దాని రుచి తెలిసింది. ఎగ్ అంటే మా

పిలగాడికి ఖుషీయే. బాయిల్డ్ ఎగ్‌వి అమాంతం ఒకటి లాగేస్తాడు లొట్టలు వేస్తూ. విజయకూడా వాడితోపాటు తంపేపీ కోసం, పాడువాసన అంటూనే తినేస్తుంది. లలితమాత్రం "రామ, రామ! ఈ కోడిగుడ్లేమిటండీ! ఇల్లంతా వానా రోతా చేస్తున్నా"రంటుంది. శ్రీనివాస్‌కు పదేళ్ళు. తరవాతది విజయ. రెండేళ్ళు చిన్నది.

"త్వరగా కాఫీ ముగిద్దురూ. . . అలా మింగేస్తున్నట్టు చూడడం ఎందుకూ మన్నా?" అన్నది లలిత.

"ఓ నాలుగు ఎగ్స్ తెప్పించుదూ. . . నీకు పుణ్యం ఉంటుంది. . . ఇవాళ ఆమ్లెట్ తినాలని ఉంది" అన్నాను.

గుండెలు బాదుకునేంత పని చేసింది లలిత.

"ఇదిగో, ఇలారండి. . ." అంటూ రహస్యం చెపుతున్నట్టుగా—

"మామగారు పూజలో ఉన్నారు. ఈ గుడ్లసంభాషణ వింటే ఇంకేమన్నా ఉందా? వంట అవుతూంది. మామూలుగా పదింటకే పడ్డించేస్తాను. గుడ్డూ గిడ్డూ అని గోల చేయకండి" అన్నది నవ్వుగా.

"ప్రతి రోజూ పది గంటలకు చేసే భోజనమేగా! ఇవ్వాళ ఆలస్యంగా చేస్తే కొంత మార్పు. కాస్త థ్రిల్!"

"గుడ్డు తింటే థ్రిల్ వస్తుందటండీ!"

"థ్రిల్‌కు నిర్వచనం ఏముంది చెప్పు? మనం ఏదనుకుంటే అదే థ్రిల్! మనసుకు ఎప్పుడు, ఏది హాయిగా ఉంటుందో అదే థ్రిల్. యంత్రాల్లా జీవితం గడుపుతున్న మనకు ఏ కొద్ది మార్పయినా థ్రిల్లే!"

నన్ను ఇట్టే అర్థం చేసుకుంటుంది లలిత. బంట్రోతును పిలిచి గుడ్లు తెమ్మని తరిమింది.

"మామగారు పూజలోంచి లేచే లోపల మీరు ముగించేయాలి ఈ కోడిగుడ్డు భాగోతం" అంటూ వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది.

మా నాన్న పూజామందిరంలోంచి మంత్రాలు వినపడుతున్నాయి. విజయ, శ్రీనివాస్ ఆడుకుంటున్నారు.

శ్రీనివాస్‌కు తాతయ్య అంటే మహా ఎగతాళి. విజయకూడా వాడితో చేరి ఆయన్ను ఆటలు పట్టిస్తుంది.

నాన్న రిటైరయి నాలుగేళ్లయింది. అమ్మ అంతకుముందే చచ్చిపోయింది. ఆయన గవర్నమెంటులో మామూలు ఉద్యోగమే చేసి, పెన్షన్ తీసుకుంటున్నాడు. పెన్షన్ సుమారు రెండు వందలు వస్తుంది.

"నేను కష్టపడి నిన్నింత వాణ్ణి చేశాన్రా. నీవు ఇంత పెద్ద ఆఫీసరయితే ఎంత సంతోషమో తెలుసా నాకు!" అంటాడు అప్పుడప్పుడు. ఏ ఊళ్ళో పనిచేసినా పెద్ద ఇల్లు ఇస్తారు ఆఫీసు వాళ్ళు. ఇల్లు పెద్దదవడంచేత నాన్నకు ప్రత్యేకంగా ఓ గది ఏర్పాటు చేస్తాను. ఆ గదిలోకి ఎవర్నీ రానివ్వడు. రోజులో చాలా భాగం తలుపులు వేసే ఉంటాయి. పిల్లలుకూడా అక్కడకు వెళ్లడానికి భయపడతారు. ఒకసారి వెళితే నాన్న వాళ్లని కసిరేశాడు. అప్పటినుండీ తలుపు సందుల్లోంచి చూడ్డం తప్ప ఎప్పుడూ లోపలకు వెళ్లలేదు వాళ్ళు. ఆయన కాలక్షేపం ఏదో ఆయన చేసుకుంటాడు. నేనూ అంతగా పట్టించుకోను. అంటీ అంటనట్టు ఉంటాను.


శ్రీనివాస్, విజయ కాన్వెంట్‌లో చదువుతున్నారు. వాళ్ల పాఠాలు, వాళ్ల చదువులు, ఆటలు వాళ్లదో జీవితం. నాకు సరే ఉండనే ఉంది. ఆఫీసు దయ్యం నన్ను పట్టుకుని వదలదు. లలితకు ఇంటిపనీ, వంటపనీ,అప్పుడప్పుడు చదువు. ఆ ఇంట్లో ఎవరి జీవితాలు వాళ్ళవి. ఎవరి పద్ధతులు వాళ్లవి. అలా అని ఆ ఇంట్లో ప్రేమకు, ఆప్యాయతకు చోటు లేదని నే నసను. మమ్మల్నందర్నీ ఒక తాటిమీద నడిపిస్తూ ఉంటుంది లలిత. పిల్లల్నీ వదిలేస్తే మా ముగ్గురి అభిరుచులూ, అభిప్రాయాలూ వేరు. మనస్తత్వాలూ వేరే.

బంట్రోతు గుడ్లు తెచ్చేడు. శ్రీనివాస్ గెంతుకుంటూ వచ్చేడు — "అబ్బ! ఎంత బావున్నాయో!" అనుకుంటూ. ఆ గుడ్డను ముట్టుకుంటే వాడికి చక్కిలిగింత. భరతనాట్యం చేస్తాడు. నాట్యం చేసినట్టే చేసి వాళ్ల తాతయ్య గదివైపు పరుగెత్తేడు. ఆ గది తలుపులు ఇంకా వేసే ఉన్నాయి. పెద్దగా ఏవో మంత్రాలు వినపడుతున్నాయి. క్షణంలో తిరిగి వచ్చేడు. వస్తూనే. "తాతయ్య 'సెల్ఫిష్ ఫెలో', నాన్నా" అంటూ నెమ్మదిగా నా దగ్గరకు వచ్చేడు.


"అలాంటి మాటలు అనచ్చునా తాతగారిని?" అని నెమ్మదిగా మందలిం


బెంగాల్ కెమికల్ వారి
గోల్డెన్ శాండల్ వుడ్ సబ్బుతో
ఆనందకరంగా
స్నానంచెయ్యండి
స్నానానంతరం ఆ మనోహర
చందన సుగంధం
మిమ్ము రోజంతా
హాయిగా ఉంచుతుంది.





బెంగాల్ కెమికల్
కలకత్తా - బొంబాయి
కాన్పూరు - ఢిల్లీ





నెహ్రూ వర్ధంతి    చిత్రం—మంగళారా జ్ఞానేశ్వర్ (హైదరాబాదు-12)

చింది లలిత. ఈ మాటలూ, మందలింపులూ మా నాన్నకు వినపడకుండా జరుగుతాయి. అదీకాక ఆయన గది కొంచెం దూరం. రెండోది, ఆయన పెద్దగా చదువుతున్న మంత్రాలు.

"మరేమో తాతయ్యే.. చాకలెట్లు, బిస్కట్లు, పకోడీలు ముందేసుకుని మంచంమీద కూచుని తింటున్నాడు" అన్నాడు శ్రీనివాస్.

లలిత నా వైపు, నేను లలితవైపు చూసుకున్నాం. మేమేమీ కామెంట్ చేయలేదు. మా నాన్న సంగతి నాకు తెలుసు. నాకు తెలుసని లలితకు తెలుసు. ఇందులో ఆశ్చర్యపడవలసిందేం లేదు.

"తలుపు సందులోంచి అలా చూడ కూడదు. నీవు మేనర్స్ నేర్చుకోవాలి" అన్నాను వాడితో.

"సారీ, నాన్నా!" అన్నాడు వాడు.

ఏదైనా తప్పు చేస్తే సారీ తక్కున చెప్పేస్తాడు శ్రీనివాస్. ఈ విషయంలో లలితకు చాలా పట్టింపు. సారీ చెప్పందే వదలదు. ఒకసారి చేసిన తప్పు రెండోసారి చేయకుండా చూస్తుంది లలిత డిసిప్లిన్ కోసం.

భోజనాల వేళ అయింది.

నాన్నకు టేబిల్ మీల్స్ ఇష్టం ఉండదు. వంటఇంట్లో పీట వేసుకుని ఆయన పద్ధతిలో ఆయన భోజనం చేస్తాడు.

శ్రీనివాస్, విజయ టేబిల్ దగ్గిర వాళ్ల వాళ్ల స్థానాల్లో కూర్చున్నారు. నేనూ కూర్చున్నాను.

లలిత వడ్డిస్తూంది.

కాకరకాయ కూర చూసేటప్పటికి, "ఈ కూర నాకు వద్దు" అని ముందుకు తోశాడు శ్రీనివాస్. విజయా ఆ పనే చేసింది. నాకా కూర అసలే ఇష్టం ఉండదు.

"ఇదేమిటే. లలితా, ఈ కాకరకాయ చెయ్యొద్దని నీ కెన్నిసార్లు చెప్పాను?" అన్నాను. నాన్న మా వైపు చూస్తున్నాడు. ఆ కూరతో ఆయన ఎంతో తృప్తిగా భోజనం చేస్తున్నాడు.

"అన్ని కూరగాయలూ మంచివే. అన్నిట్లోనూ శరీరానికి పనికివచ్చే విటమిన్స్ ఉంటాయి. కూరలు తింటే మంచిది" అంటున్నది లలిత శ్రీనివాస్‌ను, విజయను ఉద్దేశించి.

**తండ్రి దైవసమానుడు. అందుకనే పితృదేవోభవ అన్నారు. అయినా అతడు తండ్రితో సరిగా మాటాడలేక పోతున్నాడు. ఎవరో పరాయి వ్యక్తిని చూసినట్లు చూస్తున్నాడు. ఎందుకని? ఆలోచించగా దైవసమానురాలయిన తల్లి మాటలు జ్ఞప్తికి వచ్చాయి "వచ్చే జన్మలో కూడా నీవే నా భార్యగా ఉండాలే" అని తండ్రి అంటే— "ఈ జన్మకు ఇక చాలులెండి. వచ్చే జన్మలకి కూడా ఎందుకు?" అంది మాతృదేవత.**

"ఈ కాకరకాయ వేపుడు మీ అమ్మ ఎంత బాగా చేసేదో తెలుసా?" అంటున్నాడు నాన్న నన్ను ఉద్దేశించి.

"మామగారే నిన్న సాయంత్రం బజారునుండి కూరగాయలు తెచ్చారు" అన్నది లలిత.

"నీ కెందుకు, నాన్నా, అంత శ్రమ! బజారు కెళ్లడానికి బంట్రోతు ఉన్నాడుగా?" అన్నాను.

"మన పనులు మనం చేసుకుంటే తప్పేముందిరా! మనకు కావలసినవి ఏరి మంచి కూరలు మనం తెచ్చుకుంటే బావుంటుంది కాని, ఆ బంట్రోతుకు ఈ పని అప్పగిస్తే పుచ్చులూ, ముదురు కాయలూ తెస్తాడు" అన్నాడు నాన్న.

కాకరకాయ అంటే నాన్నకు మహా ఇష్టం. నాకు చటుక్కున జ్ఞాపకం వచ్చింది. ఆయన కాశీ వెళ్లినప్పుడు తనకు ఇష్టంలేని కూర గోరుచిక్కుడు కాయ కాశీలో వదిలేసి చక్కా వచ్చాడు. ఆ విషయం మా అమ్మ బతికి ఉన్నప్పుడు నాతో చెప్పింది.

మజ్జిగాఅన్నం తింటుంటే చల్లని వేళ అమ్మ జ్ఞాపకానికి వచ్చింది. ఆమె బతికి ఉన్నన్నాళ్లూ నాన్న ఆమెను శారీరకంగానూ, మానసికంగానూ హింసించాడు. "ఈ హింస కంటే చావే నయంరా, అబ్బాయీ. . .!" అని ఆమె నాతో ఓ సారి అన్నది. ఆమె కోరుకున్నట్లే ఆ మృత్యుదేవత ఏదో జబ్బురూపంలో వచ్చి తన వెంట తీసుకు వెళ్లింది. అమ్మ చచ్చిపోయిందని నాన్నకు అమ్మమీద కోపం ఇంకా ఎక్కువైంది. చచ్చిపోయింది కనక ఏం చేయలేక కసికొద్దీ తగలేశాడు శవాన్ని. మా నాన్న సంగతి నాకు తెలుసు. లలిత కేం తెలుసు, పాపం!

* * *

"పోతన సినిమా వచ్చిందట. నేను రెండో ఆటకు సినిమాకు వెళతాన్రా, అబ్బాయీ!" అన్నాడు నాన్న.

"అలాగే, నాన్నా" అన్నాను ముభావంగా.

ఆయన గదికి తాళం వేసుకుని సినిమాకు వెళ్లాడు.

విజయ, శ్రీనివాస్ పడుకున్నారు. లలిత కార్యక్రమంకూడా పూర్తి అయినట్లుంది. వంట ఇంట్లోంచి బయట పడింది. లలితకు దేవుడు, దైవం, భక్తి, పూజ, మడి— ఇలాంటి వేవో ఉన్నాయి. పొద్దున ఒక అర గంటయినా వంట ఇంట్లో దేవుడి దగ్గిర మడితో కూచుని ఏదో చేస్తుంది. బయటకు వినిపించదు. నాన్నలాగా తల పులు వేసుకోదు. ఆమెకూ కొన్ని నియమాలు ఉన్నాయి. భోజనం చేస్తున్నప్పుడు మాట్లాడదు. వేదాలూ, ఉపనిషత్తులూ వల్లెవేయకపోయినా వాటిలోని సారానికి సంబంధించిన పుస్తకాలు చదివింది; చదువుతూనే ఉంది. వివేకానంద, రామకృష్ణ పరమహంస—ఇంకా ఇలాంటి పుస్తకాలు నెమరువేస్తూ ఉంటుంది. ప్రతిరోజూ చదివే పుస్తకాల్లో గీత ఒకటి. రోజుకు ఒక అధ్యాయమన్నా పారాయణం చేయందే కార్యక్రమం పూర్తవదు. ఇక భారతం, రామాయణం, భాగవతం — ఇవంతా కొట్టినపిండి. ఆమె పి. యు. సి. వరకే చదువుకుంది. కాని ఈమధ్య ప్రైవేటుగా బి. ఎ. కు కూర్చుందామని తాపత్రయ పడుతూంది.

నేను 'హోడ్‌హౌస్' పుస్తకం తీసుకుని ఈజీ ఛైర్‌లో నెమ్మదిగా శరీరాన్ని చేరవేశాను, సిగరెట్టు ముట్టించి.

"ఏమండీ. . . ఈ మధ్య మామగారితో మరీ ముభావంగా ఉంటున్నారు. ఆయన మనసు నొచ్చుకుంటుందేమో?" అన్నది లలిత. ఇది నిజమే. నా కాయనతో మాట్లాడ బుద్ధి కావడం లేదు.

"ఆయన సంగతి నీ కింకా బాగా తెలియదు, లలితా" అన్నాను.

"తెలిసేందుకు, తెలియక పోయేందుకు ఏముందండీ? పెద్దవారు ఆయన. ప్రాణాలన్నీ మీ మీదే పెట్టుకున్నారు. ఒక మూల అత్తగారు పోయారని మానసికంగా బాధ. మరోవైపు మీరు కూడా చిన్నచూపు చూస్తున్నారని వేదన. . ."

"మా అమ్మ చచ్చిపోయిందని ఆయన కేం దుఃఖం లేదు."

"అంత మాట అనకండి. ఆ గదిలో అత్తగారి ఫోటో పెట్టుకుని, నిత్యమూ పూజలాంటి దేదో చేస్తున్నారు. రోజు కో పువ్వు ఆ ఫోటోమీద ఉంచుతారు. . ."

"నీవు వట్టి అమాయకురాలివి, లలితా. . . ఎవరైనా చచ్చిపోయిన భార్యకు పూజలు చేస్తారా! బతికి ఉన్నన్నాళ్లూ హింసించాడు. ఇప్పుడేమో తన భార్య ఉత్తమ ఇల్లాలని అందరితో చెప్పుకుంటాడు. ఎవరైనా కనిపిస్తే వదలడు. మొన్నొకసారి ఏమైందో తెలుసా? ఈ ఊళ్లో కాలేజీలో ఏవో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటే ఒక నాటి సభకు నేను అధ్యక్షత వహించవలసి వచ్చింది. నా ఉపన్యాసంలో నాలుగు మంచి ముక్కలు విద్యార్థులకు చెప్పాను. అది వాళ్లందరికీ నచ్చి సంతోషించారు. ఆ మీటింగుకు నాన్నకూడా వచ్చాడు. ముందువరసలో కూర్చున్నాడు. మీటింగ్ అయిపోయే సమయంలో నాన్న లేచాడు—నన్ను రెండు ముక్కలు చెప్పనివ్వండి అని. నా మీద ఉన్న గౌరవంచేత ప్రిన్సిపల్‌గారు సరే అన్నారు. ఉపన్యాసం మొదలెట్టి ఏవేవో చెప్తున్నాడు. చెప్తూ, చెప్తూ గీత లోకి వెళ్లాడు — తనేదో గీతమీద అథారిటీ అయినట్టు. చాదస్తంగా ఏదో చెప్తుకుపోతుంటే పిల్లలంతా చప్పట్లు కొట్టారు. చివరకు దిగు, దిగు అనే వరకూ వచ్చింది. నాకు చాలా చిన్నతనమైంది. మీటింగ్‌లోకూడా తన భార్య సంగతి ఒకటి రెండు సార్లు ప్రస్తావించాడు. ఈయనకు సమయాసమయాలు బొత్తిగా తెలియవు. పైగా, ఎప్పుడైనా ప్రత్యేకమైన సభ ఏర్పాటు చేయించవలసిందని, ఆ సభలో తను గీతమీద ఉపన్యాసం ఇస్తానని ప్రిన్సిపల్‌గారిని అడుగుతున్నాడు. గీతమీద ఓ వెయ్యి పేజీల గ్రంథం వ్రాస్తున్నానని అందరితో డబ్బా వాయించుకుంటున్నాడు—"

"గీతమీద గ్రంథం వ్రాస్తున్నారా? ఇది నాకు తెలియదే! మీ నాన్నగారు పుణ్యాత్ములు. మీ రిలా ఆయన్ను చిన్నచూపు చూడటం నా కేం నచ్చలే. . ."

"అయ్యో, లలితా! నీ వింకా పురాణ యుగంలో ఉన్నావు! ఇదంతా మోసం. నీకు తెలియదు" అని పగలబడి నవ్వేను.

నా నవ్వులోని అర్థం లలిత గ్రహించుకున్నట్టు లేదు. విడమరిచి చెప్పడం నా కిష్టం లేదు. నిదానంగా లలితే గ్రహించుకుంటుందని నా నమ్మకం.

ఊళ్లో సినిమాలకు, నాటకాలకు ప్రతిదానికీ సిద్ధం. పైగా ఫలానా ఆఫీసరు నాన్నగారిని అని చెప్పుకుని ముందు వరసలో కూర్చుంటాడు. సభల్లోనూ, నాటకాల్లోనూ, ప్రతి దాంట్లోనూ నన్ను ఇరికిస్తాడు— నా పేరు చెప్పుకుంటూ.

ఏ ఊరు ట్రాన్స్‌ఫర్ అయినా, ముందు ఊళ్లోకి వెళ్లి, ఊరంతా సర్వే చేసి వచ్చి, అందరితోనూ చెప్పుకుంటాడు "మా పిల్లవాడు బంగారు తండ్రి" అనీ, "నా భార్య ఉత్తమ ఇల్లా"లనీ. నలుగురినీ మంచి చేసుకుంటాడు. కొన్నాళ్ళు పోతే కాని ఈయన మంచితనం బయటపడదు.

ఈ విషయాలన్నీ లలితతో చెపితే నేనే చులకనైపోతాను.

నాన్నని లలిత ఎదుట ద్వేషించలేను. నాకు మాత్రం ఆయనంటే గౌరవం లేకపోగా ద్వేషం ఎక్కువవుతున్నది.

"ఏమండీ...తండ్రి దైవసమానుడు. అందుకనే పితృదేవోభవ అన్నారు. మీరు మామగారితో సరిగా మాట్లాడ్డం లేదు. ఎవరో పరాయివ్యక్తిని చూసినట్టు చూస్తున్నారు. నా మాట విని మీరు మీ పద్ధతి మార్చుకోండి" అంటూ నా దగ్గిరగా వచ్చింది లలిత. లలిత శరీరం అసలే సుకుమారం. దానికితోడు సన్నజాజుల మెత్తటి పరిమళం. నా కేమిటో పన్నీరుజల్లులా ఉంది.

మా నాన్న రెండో ఆట సినిమా కెళ్లాడు. సినిమాకే వెళ్లాడో? ఏమో?

మళ్లీ మా అమ్మ జ్ఞాపకాలు. . .

నాన్న ఓ రోజు అన్నాడు అమ్మతో, "వచ్చే జన్మలోకూడా నీవే నా భార్యగా ఉండాలే" అని. అది హాస్యమో, వేళాకోళమో తెలియలేదు.

"ఈ జన్మకు ఇక చాలు లెండి. వచ్చే జన్మలోకూడా ఎందుకు?" అన్నది అమ్మ ముక్తసరిగా.

ఆ మాటలు ఇంకా నాకు వినపడుతూనే ఉన్నాయి.

అమ్మమీద చేయి చేసుకున్నప్పుడు ఎన్ని సందర్భాలలోనో నా కళ్లు చెమ్మగిల్లాయి. మహా కసిగా ఉండేది. నేను మరీ చిన్నవాణ్ణి. కసి, కోపం దిగమింగుకుని, భయపడుతూ మూల నక్కేవాణ్ణి. అవన్నీ లలిత కేం తెలుసు? పాపం, పితృదేవోభవ అని నా కేవో చెపుతున్నది.

"మామగారికి అరవై ఏళ్లు నిండబోతున్నాయి. అత్తగారుంటే షష్టిపూర్తి ఎంత వైభవంగా జరిగేదో కదా!" అంటూ జాలి ఒలకబోసింది లలిత.

నేను దగ్గరగా జరిగేను.

లలిత మరీ దగ్గరగా జరిగింది.

"నాన్న మంచివాడే గాని — " అంటుండగా నా నోరు నొక్కేసింది లలిత.

"హతోస్మి" అన్నాను.

లలిత పెద్దగా నవ్వేసింది.

అలా నవ్వుతుంటే నా కెంతో బావుంటుంది. ఆ నవ్వులో అమాయకత్వం, ఆప్యాయత, ఓ విధమైన 'బ్లిస్' ఉంది. గాలిలో ఎక్కడికో తేలిపోతున్నట్లుంటుంది. అదో హాయి.

"మంచీ చెడూ కలిస్తేనే గదా మనిషి? చిన్నప్పటినుండీ మీ రెందుకో ఆయనంటే ద్వేషం పెంచుకున్నారు. మీ కాయన విషయం ఇప్పటికే ప్రతిదీ చేదుగానే కనిపిస్తుంది. నేను మీలా

సైకాలజీ చదువుకోలేదనుకోండి'' అన్నది లలిత.

'అబ్బ! దెబ్బ కొట్టావే!' అనుకున్నాను. తమాయించుకుని, ''అబ్బే! అదేం లేదు. ఆయనంటే నాకెందుకూ ద్వేషం?'' అన్నాను.

''మీరు అన్నా అనకపోయినా మీ మనసులో అలాంటి భావమేదో ఉంది. అది మిమ్మల్ని వెంటాడుతున్నది. ఆ ద్వేషపు నీడలోంచి తప్పించుకోలేక పోతున్నారు. అది ఓ రకంగా మనలో లోపమేనని ఎందుకనుకోకూడదు?'' అన్నది.

మళ్ళీ దెబ్బమీద దెబ్బ.

''నీడా లేదు, గీడా లేదు. అంతా హంబక్'' అన్నాను నవ్వుతూ.

నవ్వేనే కాని, ఆ నవ్వులో నవ్వు లేదు. మరేమిటి? అనుమానమా, ద్వేషమా, క్రోధమా? ఏమిటో నాకే తెలియడం లేదు. లలితతో ఏం చెప్పను?

లలిత ఒక్కో రోజు చిన్న పట్టుబట్ట చుట్టుకుని మడిలో కూర్చుంటుంది మడిచీరె ఆరకపోతే. ఆ చిన్నపట్టుపంచె ఒంటికంతా సరిపోదు. లలిత నిండు మనిషి కనక వీపూ, పిక్కల పైభాగం కనిపిస్తూ ఉంటుంది.

ఒక రోజు అలా పూజలో కూర్చున్నప్పుడు—

నాన్న వంట ఇంట్లోకి వెళ్ళి, ఒక అడుగు లోపల వేసి, మళ్ళీ ఒక అడుగు వెనక్కు వేసి, ''అమ్మాయీ, లలితా! రెండు ఉద్ధరిణిలుంటే ఇవ్వమ్మా!'' అన్నాడు.

ఇలాంటి సంఘటనలు ఒకటి రెండు నా కంట పడ్డాయి. నాకు ఒళ్ళు మండిపోయింది. ఈయన నిజంగా ఉద్ధరిణిల కోసమే వెళ్ళాడా లోపలికి? ఈయన కళ్ళు మంచివి కావు. లలితను తినేట్టు చూస్తాడు అప్పుడప్పుడు.

లలిత బాత్‌రూమ్‌లో స్నానం చేస్తున్నప్పుడు ఒకటి రెండు సార్లు నాన్న ఆ వైపు తచ్చాడుతుండటం నేనో సారి గమనించాను. ఆ బాత్‌రూమ్ తలుపుకు చిన్న దూరే సందున్నాయి... అబ్బ, ఏం మనిషి, ఈ నాన్న! నాకు కోపం, కసీ ఎక్కువైనాయి. ఒకసారి నాన్నను అడుగుదామని నోటిదాకా వచ్చింది. ఈ విషయం లలితకు తెలిసి, నాన్న మనసు కష్టపెట్టుకుని, అంతా రభస అవుతుందని మెదలకుండా ఊరుకున్నాను. నాన్నకూడా ఓ మనిషేనా! ఇన్నేసి ఏళ్ళు వచ్చాయి — ఇవేం బుద్ధులు?


అయినా నేను ఊరికే అనుమాన పడుతున్నానేమో? నా అనుమానంలో కొంత నిజం లేకపోలేదు. ఆయన స్వభావం నాకు తెలుసు. లలితకు విడమరిచి హరికథలా చెప్పడం ఎలా?

లలిత తన పరీక్ష, పుస్తకాల ప్రసక్తి తెచ్చింది. పరీక్షలు దగ్గర పడుతున్నాయి.

''కొన్ని సబ్జక్ట్సయినా మీరు చెప్పందే నా చదువు పూర్తవదు'' అన్నది లలిత.

''నాకు తీరిక ఎక్కడిది, లలితా? చూస్తూనే ఉన్నావుగా. ఆఫీసుపని, బాధ్యతలు. కొంచెంకూడా విశ్రాంతి లేదే? కాస్త విశ్రాంతి దొరికితే 'చేజ్ హాడ్లీ' నవలలు వదలబుద్ధి అవదు. నీవే చదువుకుందూ. పెద్ద బ్రహ్మాండం ఏంలేదు'' అన్నాను.

''పోనీ, మామగారు ఖాళీగానే ఉంటారుగా? ఆయనకు వీలుపడుతుందేమో అడగనా?'' అన్నది.



కొరడాతో కొట్టినట్లయింది. నా పళ్ళు బిగుసుకున్నాయి... నా కళ్ళలో నెత్తురు చిమ్మింది...

''ఆయనకు మాత్రం తీరికెక్కడిది? ఆయన పూజలు, ఆయన వ్రాతలు, బజారుపనులు, ఊళ్ళో పెత్తనాలు— వీటితోనే సరిపోతుంది. అయినా ఆయన బి. ఎ. వాళ్ళకు చదువేం చెప్పగలడు?'' అని నవ్వేశాను.

''మీ రన్నిటికీ నవ్వుతారు. నేను పరీక్షకు సీరియస్‌గానే చదువుతున్నాను తప్పక పాసవాలని'' అని మారాం చేసింది లలిత.

లలిత సీరియస్‌గా ఉన్నప్పుడు నేను నవ్వడం, నేను సీరియస్‌గా ఉన్నప్పుడు లలిత నవ్వడం మా ఇద్దరికీ పరిపాటయిపోయింది.

మళ్ళీ సంభాషణలో నాన్న సంగతి...

''ఆయన వచ్చినప్పుడు, బయటకు వెళ్ళినప్పుడు రెండు మాటలు మాట్లాడండి. ఆయనకు ఎంత తృప్తిగా ఉంటుందో'' అన్నది.

''మా ఇద్దరి మధ్యా మాటలేముంటాయి? నా కేం మాట్లాడాలో తోచదు.''

''ఆయన రిటైరయినారనీ, ఆయనకు భార్య లేదనీ మీరు చాలా చులకనగా చూస్తున్నారు.''

''అబ్బే, అదేం లేదు! కాని, నా కంటికి ఓ క్రూరుడుగా కనిపిస్తాడు. ఎందుకో ఆయనంటే నాకు ఎలర్జీ!'' నెమ్మది నెమ్మదిగా నాలోని ద్వేషం బయటకు వస్తోంది.

''మీకు మొదటినుండీ జీవితం వడ్డించిన విస్తరయింది. మామగారు ఏ లోటూలేకుండా కష్టపడి చదువు చెప్పించారు. మీకు ఎలాటి ఇబ్బందీ కలగలేదు. చదువు పూర్తవగానే వెతుక్కోకుండా మంచి ఉద్యోగంవచ్చింది. ఆ తరవాత నన్ను పెళ్ళాడారు. మీ నాన్నగారి విషయం ఆలోచించండి. ఆయన్ను గురించిన వివరాలు నాకు ఎక్కువ తెలియవనుకోండి. ఆయన జీవితంలో విస్తరాకుల దగ్గిరనుంచీ వెతుక్కోవలసి వచ్చింది. చాలీచాలని జీతం... పెద్ద సంసారం. ఏవో చిక్కులు. మీరే అన్నారు ఓ సారి ఆయన జీవితంతో ఎప్పుడూ యుద్ధం చేస్తుండేవారని. ఆయనకూ, మీకూ తేడా లేదూ? ఫ్రస్ట్రేషన్ మనిషిని ఎలా కుంగతీస్తుందో నా కన్న మీకే ఎక్కువ తెలుసు. సైకోఎనాలిసిస్ నాకు తెలియదనుకోండి. మీ రనుకున్నట్లు ఆయన నిజంగా క్రూరస్వభావులే అయితే దానికి కారణాలేవో ఉంటాయి. అవి మనసుకు సంబంధించినవి. మీ కోసారి ప్రమోషన్ ఆర్నెల్లు ఆలస్యంగా వచ్చిందని ఎంత చికాకుపడ్డారు! కొన్నాళ్ళు మీ స్వభావమే పూర్తిగా మారిపోయింది. నన్నుకూడా కసిరేసిన రోజులు లేకపోలేదు. ఆ తరవాత మళ్ళీ మామూలు మనిషి అయినారు'' అంటూ చెప్పుకుపోతున్నది.

ఈ మాటలు లలితే చెపుతున్నదా... ఫ్రాయిడ్, జంగ్ చెపుతున్నారా? అనిపించింది.

''ఏదోలెండి, పిచ్చిదాన్ని ఏదో వాగుతున్నానని కోప్పడకండేం? నాకు శాస్త్రాలూ, సైకాలజీ తెలియవు. జీవితంలో ఏ రకంగానైనా అసంతృప్తి ఉంటే మాత్రం — అది పిశాచంలా పట్టుకుని మనిషిని చెండుకు తింటుంది. ఇది నాకు తోచిన అభిప్రాయం'' అన్నది చిటికె వేసి ఆవలిస్తూ.

''నిద్ర వస్తోందా, లలితా?'' అన్నాను.

నాన్నమీద చర్చ కాదు కాని ఆ రోజు పన్నెండు గంటలయింది.

''మధ్య నా కెందుకు లెండి! మామగార్ని వెనకేసుకొస్తున్నానని మీ రనుకోవడం... మీకు నేను చెప్ప నేర్చిన దాన్ని కాదు. మనిషిని మనిషి కాక పోతే మరెవరు క్షమిస్తారు? మనిషిలో మంచీ చెడూ విడగొట్టి, చెడునే చూడకుండా మనిషిని మనిషిగా చూస్తే మంచిదని నా అభిప్రాయం. మన ఆలోచనల్లో సమగ్రతకు స్థానం ఇవ్వాలి'' అన్నది.

నేను ఆలోచిస్తున్నాను.

లలిత నెమ్మదిగా నిద్రకు ఉపక్రమించింది.

లలిత బాగా పెరిగింది నా దృష్టిలో.

నాకు నిద్ర పట్టడం లేదు. నాన్నను గురించే ఆలోచిస్తున్నాను. నే నెవరిని? అన్న ప్రశ్న ఎదురైంది. నాలో అహం 'నేనే' అన్నది. నువ్వా? అన్నాను. 'నోరుముయ్' అన్నది.

ఆలోచిస్తున్నాను. నాన్నను గురించే ఆలోచిస్తున్నాను. ద్వేషం, క్రోధం, కసి పెనుగులాడుతున్నాయి...

ఒకటి గంట అయింది.

తలుపు కొట్టారెవరో.

ఆలోచిస్తున్నాను. నాన్నను గురించే ఆలోచిస్తున్నాను. ద్వేషం, క్రోధం, కసి పెనుగులాడుతున్నాయి.

ఒంటి గంట అయింది.

తలుపు కొట్టా రెవరో.

ఇంకెవరు? నాన్న. అందరిలాంటి మామూలు మనిషి.

మామూలు నాన్న. సినిమానుండి తిరిగి వచ్చినట్టుంది.

రాగానే నాన్నకు మంచినీళ్లిచ్చాను.

''సినిమా బాగుందా, నాన్నా?'' అన్నాను.

''బ్రహ్మాండంగా ఉందిరా'' అన్నాడు.

కాస్సేపు నిశ్శబ్దం.

''అబ్బాయీ, ఇంకా నీవు నిద్రపోయినట్టు లేదే? లైటు వెలుగుతూంది.''

''ఏదో పుస్తకం చదువుతున్నాను.''

''ఏం పుస్తకాల్లా... ఇంత పొద్దుపోయేదాకానా... నీకు మహా నవలల పిచ్చిరా'' అంటూ తన గదిలోకి వెళ్ళాడు.

నేను లలిత పక్కన చేరేను. ★